# శ్రీ వాసుదేవ్ కృష్ణాజీ నాయక్

శ్రీ వాసుదేవ్ కృష్ణాజీ నాయక్ డెప్యూటీ స్పీకర్‌గా మూడవ శాసనసభ (1962-1967) 1962, జూలై 7న ఏకగ్రీవంగా ఎన్నికై 1967, ఫిబ్రవరి 28వరకు మరియు నాల్గవ శాసనసభ (1967-1972) 1967, మార్చి 29న ఎన్నికై 1972, మార్చి 1 వరకు ఆ పదవిని నిర్వహించారు.

శ్రీ వాసుదేవ్ కృష్ణాజీ నాయక్ మాతృ భాష మరాఠీ అయినప్పటికి, వీరి పూర్వీకులు కర్నూలు జిల్లా, ద్రోణాచలం సమీప గ్రామమునకు చెందినవారు. వీరు తెలుగుభాషను చక్కగా మాట్లాడేవారు.

వీరు 1957వ సంవత్సరము తెలంగాణా ప్రాంతము నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో నగరంలోని సుల్తాన్ బజార్ నియోజకవర్గం నుండి ఎన్నికయినారు. వీరు శాసనసభలో వివిధ కమిటీలలో సభ్యునిగా ఉన్నారు. వీరు 1958-1959 సంవత్సరములో అంచనాల కమిటీ అధ్యక్షునిగా ఉన్నారు.

వీరు1962వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో సుల్తాన్ బజార్ నియోజకవర్గం నుండి రెండవసారి శాసనసభ్యునిగా ఎన్నికైనారు. వీరు డెప్యూటి స్పీకర్ హోదాలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా ఉన్నారు.

శ్రీ వాసుదేవ్ కృష్ణాజీ నాయక్ 1967 వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో నగరంలోని గగన్ మహల్ నియోజకవర్గం నుండి రాష్ట్రశాసనసభకు మూడవసారి ఎన్నికైనారు. వీరు 29-03-1967 న ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో శ్రీమతి జె. ఈశ్వరీ బాయిని ఓడించి ఆ పదవిలో 01-03-1972 వరకు కొనసాగారు. వీరు శాసనసభ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించారు.

# శ్రీ వాసుదేవ్ కృష్ణాజీ నాయక్ డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, స్వపక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకొన్నందుకు నేను నా కృతజ్ఞత వెలిబుచ్చుతున్నాను. నేను ఆంధ్రకు చెందినానా, తెలంగాణాకు చెందినానా, మహారాష్ట్రకు చెందినానా అని ఒక్క నిమిషం కూడ అనుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిగా, యీ లెజిస్లేచర్‌లోగాని, బయటగాని ఎక్కడ వున్నా, ఆంధ్రుడుగనే భావించుకొంటాను. ఆ అభిమానం నాకు ఉన్నది. నేను యీ పదవిని స్వీకరించేటప్పుడు నాకు కొంత సందేహం కలిగింది. ఇప్పుడు ప్రతి పక్ష నాయకులు తెలుగులో జరిపించాలని చెప్పారు. నేను తెలుగు భాషలో అధికార వాణితో, సామరస్యంగా చెప్పడంలో కొంచెం లోపం వుంటుంది. నాలో యీ విషయంలో ఎంత లోపంవున్నా సభ్యులు నా లోపాలను చూడకుండా నా భావాలనే గ్రహించుతారనే ఉద్దేశంతో నేను యీ సాహసం చేస్తున్నాను, ఇంతేగాదు, తమ విజ్ఞానం, experience అన్నీ కూడ నాకు కలుగుతాయి, కనుక నేను ఆ ఆశతో అంగీకరించాను. తమ guidance తీసుకొంటాను, నేను యీ August Body యొక్క dignity ని మీ అందరి సహకారంతో కాపాడగలనని ఆశిస్తున్నాను. సభ్యుల అందరి legitimate rights కాపాడడానికి మీరు నాకు శక్తి యివ్వాలి. మీ అందరూ సహకారం యివ్వాలని కోరుతూ, నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు కృతజ్ఞత చెబుతూ విరమిస్తున్నాను. జైహింద్.